రంజాన్ వేళలు

	ఇఫ్తార్(బుధవారం)	సహరీ(గురువారం)
కర్నూలు	6:35 (సాయంత్రం)	4:54 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:32 (సాయంత్రం)	5:06 (ఉదయం)
ఆదోని	6:37 (సాయంత్రం)	4:54 (ఉదయం)

వైసీపీకి ఆగ్రోస్ స్థలం

- ఏడాదికి రూ.1,600 అద్దె
- 33 సంవత్సరాలు లీజుకు..
- రాజప్రాసాదంగా పార్టీ కార్యాలయ భవన నిర్మాణం
- మారుమూల కల్లూరుకు ఆగ్రోస్ ఆఫీసు, ఎక్స్‌పో కేంద్రం

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 26: ఒకప్పుడు ఆగ్రోస్ సంస్థ ద్వారా రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలిగేవి. వైసీపీ ప్రభుత్వం ఆ సంస్థను నిర్వీర్యం చేసింది. అక్కడితో ఆగలేదు. ఆ సంస్థకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విలువైన స్థలాలను కారు చౌకగా స్వప్రయోజనాల కోసం కాజేస్తోంది. కర్నూలు నగరంలోని రైల్వేరోడ్డు కూడలి వద్ద దాదాపు రూ.100 కోట్ల విలువ చేసే 1.60 ఎకరాల స్థలం ఆగ్రోస్ ఆధీనంలో ఉండేది. ఈ స్థలాన్ని ప్రభుత్వం కారుచౌకగా కొట్టేసి రాజప్రసాదంలా వైసీపీ కార్యాలయాన్ని నిర్మిస్తోంది. రైతులు ఇదేమి దారుణం అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారం ఉంది కదా అని రైతాంగానికి సేవ చేసే సంస్థ ఆస్తులను ఇట్లా కొట్టేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ స్థలానికి ఏడాదికి కేవలం రూ.1,600 అద్దె చెల్లించేలా 33 సంవత్సరాలకు ఒప్పందం కుదుర్చుకున్నారు.

రైల్వేస్టేషన్ రోడ్డు సర్కిల్ వద్ద ఆగ్రో స్థలంలో నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయం





గోదాములో ఆగ్రో కార్యాలయం

కర్నూలులోని ఆగ్రోస్ కార్యాలయ స్థలంలో రైతులకు అవసరమైన ఎరువులను నిల్వ చేసేందుకు గోదాములు ఉండేవి. వ్యవసాయ యంత్ర పరికరాల కేంద్రాన్ని గతంలో నిర్వహించారు. ఆ స్థలం మీద వైసీపీకి కన్నుపడింది. పార్టీ కార్యాలయాన్ని రాజప్రసాదంలా నిర్మించుకోవాలని అనుకున్నారు. దీని కోసం ఈ స్థలాన్ని లీజుకు తీసుకున్నారు. ఆగ్రో కార్యాలయాన్ని అక్కడి నుంచి కల్లూరులో ఒక మారుమూల ప్రాంతంలో ఉన్న గోదాములోనికి మార్చివేశారు. విలువైన యంత్రపరికరాల ఎక్స్‌పో కేంద్రాన్ని కూడా అక్కడే ఏర్పాటు చేశారు. దాదాపు నాలుగైదు కి.మీల దూరంలో ఉన్న ఈ ఎక్స్‌పో కేంద్రం వద్దకు వెళ్లడం కష్టమై రైతులు అవైపు వెళ్లడమే మానేశారు. దీంతో ఆగ్రోస్ కార్యాలయ ప్రాంగణంలో పిచ్చిమొక్కలు మొలిచాయి. మేత కోసం అక్కడ పశువులు తిరుగుతున్నాయి. పాములు గోదాములోకి వస్తున్నాయని సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. నగరం నడిబొడ్డున ఉన్న ఆగ్రో స్థలంలో మాత్రం వైసీపీ కార్యాలయానికి భవంతిని నిర్మిస్తున్నారు.

● నామమాత్రంగా అద్దె

కర్నూలు నడిబొడ్డున రైల్వే రోడ్డు కూడలి వద్ద దాదాపు రూ.100 కోట్లు విలువ చేసే ఆగ్రో కార్యాలయం ఒకప్పుడు రైతుల రాకపోకలతో కళకళలాడేది. పంట సాగు కోసం అవసరమైన పనిముట్లను కొనుగోలు చేసేందుకు రైతులు ఇక్కడికి వచ్చేవారు. అయితే ఈ స్థలాన్ని కారుచౌకగా కొట్టేయాలని మొదటి నుంచి రాజకీయ నాయకుల మనసులో ఉండింది. ఎట్టకేలకు వైసీపీ ప్రభుత్వం రాగానే ఆ పార్టీ నాయకులు ఆ స్థలాన్ని కాజేయడానికి పథకం తయారు చేశారు. ఎకరా 60 సెంట్ల విస్తీర్ణం ఉన్న ఈ స్థలంలో పార్టీ కార్యాలయాన్ని నిర్మించేందుకు గత సంవత్సరం ప్రభుత్వం ఏడాదికి రూ. 1,600 అద్దెతో 33 సంవత్సరాలకు వైసీపీకి లీజుకు కట్టబెట్టింది. ప్రస్తుతం ఈ స్థలంలో వైసీపీ కార్యాలయ భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏ వ్యాపార సంస్థకు లీజుకు ఇచ్చినా నెలకు లక్షలాది రూపాయలు ఆగ్రోస్ సంస్థకు లభించేవని, అటువంటిది వైసీపీ ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి తన పార్టీ కార్యాలయానికి నామమాత్రపు అద్దెకు లీజుకు ఇచ్చిందనే విమర్శలు వినిపిసున్నాయి.

గోదాములో ఆగ్రో కార్యాలయం

కర్నూలు నడిబొడ్డున రూ. కోట్ల విలువ చేసే ఆగ్రో స్థలాన్ని వైసీపీ కార్యాలయ భవన నిర్మాణానికి తీసుకొని అక్కడ ఉండిన ఆగ్రోస్ కార్యాలయాన్ని, యంత్ర పరికరాల ఎక్స్‌పో కేంద్రాన్ని కల్లూరులోని మారుమూల ప్రాంతానికి తరలించేశారు. కల్లూరు మారుమూల ప్రాంతానికి వెళ్లేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. అయినా దాదాపు రూ.50 లక్షల దాకా ఖర్చు చేసి రైతులకు రాకపోకలు లేని ఆ ప్రాంతంలో యాంత్రీకరణ ఎక్స్‌పో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతులు రాకపోవడంతో ఈ ఎక్స్‌పో కేంద్రంలో ఉన్న విలువైన యంత్రపరికరాలు గాలి, వానకు తుప్పు పట్టిపోతున్నాయి. ఎక్స్‌పో కేంద్రం పరిసరాల్లో పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు ఏపుగా పెరిగాయి. పాములు తిరుగుతున్నాయి. దీంతో ఇక్కడే ఏర్పాటు చేసిన ఆగ్రో కార్యాలయంలో విధులు నిర్వహించడానికి సిబ్బంది భయపడుతున్నారు. ప్రభుత్వానికి నిజంగానే రైతులపై ఏ మాత్రం ప్రేమ ఉన్నా ఆగ్రోస్ స్థలంలో రైతులకు ఉపయోగపడే కేంద్రాలు ఏర్పాటు చేసి ఉండాల్సింది. రైతులకు అవసరమైన కార్యక్రమాలను అక్కడ నిర్వహించి ఉండాల్సింది. నగరంలో ఉండే ఆగ్రో స్థలాన్ని సొంత పార్టీకి ఇచ్చేసి, రైతు ప్రయోజనాలను దెబ్బతీయడం ఏమిటని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



కల్లూరులో పశువులు తిరుగాడుతున్న యాంత్రీకరణ ఎక్స్‌పో కేంద్రం

ఆ స్థలాన్ని ప్రభుత్వం లీజుకు ఇచ్చింది



రైల్వే రోడ్డు కూడలి వద్ద ఆగ్రోస్ స్థలాన్ని ప్రభుత్వం 33 సంవత్సరాల పాటు ఏడాదికి రూ.1,600 అద్దె చెల్లించేలా ప్రభుత్వం లీజుకు ఇచ్చింది. ప్రస్తుతం కల్లూరులో యంత్ర పరికరాల ఎక్స్‌పో కేంద్రం నడుస్తోంది. యంత్ర పరికరాలను వినియోగించుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాము.

- జయచంద్రారెడ్డి, ఆగ్రోస్ మేనేజర్

రైతుల ప్రయోజనాలు పణంగా పెడతారా?



వైసీపీ ప్రభుత్వం కోట్ల విలువ చేసే ఆగ్రోస్ స్థలాన్ని కారుచౌకగా పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం 33 సంవత్సరాలు లీజుకు ఇవ్వడం అత్యంత దారుణమైన విషయం. ఒకప్పుడు పార్ట్‌టైం ఉద్యోగిగా నేను ఆగ్రోస్ కార్యాలయంలో పని చేసేవాడిని. కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి ఎ ంతో మంది రైతులు ఇక్కడికి వచ్చి తమకు అవసరమైన పరికరాలను తీసుకునివెళ్లేవారు. ఇప్పుడు ఆగ్రోస్ కార్యకలాపాలను కల్లూరులో ఉన్న మారుమూల ప్రాంతానికి తరలించడం దారుణం.

- శంకర్, రైతు

తప్పు ఒప్పుకున్న వారికి శవయాత్ర

- కుంభాలతో పురుషులు
- ముగిసిన రతీ మన్మథుల రథోత్సవం



మగువ వేషధారణలో పురుషులు





ఆదోని రూరల్, మార్చి 26 : ఆదోని మండలం సంతెకుడ్లూరు గ్రామంలో అట్టహాసంగా ప్రారంభమైన హోలీ సంబరాలు విభిన్న రూపాల్లో మంగళవారం ముగిసాయి. సోమవారం నుంచి గ్రామంలో మొదలైన హోలీ సంబరాల్లో భాగంగా పురుషులు స్త్రీ రూపంలో బసవేశ్వరస్వామి దేవాలయంలో వెలసిన రతీ మన్మథులకు పూజలు చేశారు. మంగళవారం ఉదయం శవయాత్ర నిర్వహించారు. తప్పులు చేసిన రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు వాటిని ఒప్పుకోవడంతో అగ్నిగుండం చుట్టు వారిని నాలుగు వైపుల నలుగురు మోసుకొని కన్నీరు పెడుతూ, శవయాత్ర నిర్వహించారు. అనంతరం పురుషులు కలశాలు చేత పట్టుకొని, తలపై కుంభాలు మోస్తూ, అంచు పట్టు చీరెలో స్వామిని దర్శించుకున్నారు. ఈ వేడుకలకు కర్ణాటకతోపాటు జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సాయంత్రం పెద్ద ఎత్తున రతీ మన్మథుల రథోత్సవం నిర్వహించారు. రూరల్ సీఐ నీరంజన్ రెడ్డి, ఇన్చ్ ఎస్.ఐ శ్రీనివాసులు ఏర్పాట్లు చేశారు.

అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన

కల్లూరు, మార్చి 26 : జిల్లాలోని ఓటర్లు అందరూ తమ ఓటుహక్కును కచ్చితంగా వినియోగిం చుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా..జి. సృజన పేర్కొన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్‌లోని ముజఫర్‌నగర్ మున్సిపల్ అప్పర్ ప్రైమరీ స్కూల్ నుంచి ఆటోస్టాండ్ వరకు నిర్వహించిన ఓటర్ల అవగాహన ర్యాలీలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్.జి. సృజన, పాణ్యం రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఎస్పీ కృష్ణకాంత్ పాల్గొ న్నారు. అనంతరం పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భాగంగా ముజఫర్‌నగర్‌లోని మున్సిపల్ అప్పర్ ప్రైమరీ స్కూల్ ఆవరణలో గల 112, 113, 114, 115, 116, 117 పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్.జి. సృజన మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఓటర్లు భయాందోళనలకు గురికాకుండా ఓటు హక్కు వినియోగించుకోడానికి భరోసా ఇవ్వడమే తమ ఉద్దేశమన్నారు. ముఖ్యంగా యువ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యపరిచి, వారితో శపథం చేయాలని పిలుపునిచ్చారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దారు నాగముని డీఎస్పీ విజయ్‌శేఖర్, మెప్మా పీడీ నాగశివలీల, పోలింగ్ కేంద్రం స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఓటర్ల అవగాహన ర్యాలీలో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన

సచివాలయాల అడ్మిన్లకు మెమో

కర్నూలు(న్యూసిటీ), మార్చి 26: నగర పాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను 50 శాతం కంటే తక్కువగా వసూలు చేసిన 83 సచివాలయాల అడ్మిన్లకు కమిషనర్ ఎ. భార్గవతేజ మంగళవారం మెమో జారీ చేశారు. ఆస్తి పన్ను, నీటి పన్ను వసూళ్లపై అధికారులకు ప్రత్యేకంగా సమావేశాలు, టెలి కాన్ఫరెన్సులు నిర్వహించారని మెమోలో పేర్కొన్నారు. సచివాలయ అడ్మిన్లు పన్ను వసూళ్లపై దృష్టి కేంద్రీకరించాలని కమిషనర్ పేర్కొన్నారు. 83 సచివాలయాల్లో పన్ను వసూళ్లు తక్కువగా ఉన్నట్లు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వస్తున్నాయని, దీనిని సీరియస్‌గా తీసుకోవాలని కమిషనర్ సూచించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులు పన్ను వసూళ్లపై పర్యవేక్షణ చేయడం లేదని అన్నారు.

● నగర పాలక సంస్థ కార్యాలయంలో పన్ను వసూళ్లు చేసేందుకు ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేశారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్నుల బకాయిలను 2023-24 రెండో ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెలాఖరు వరకు పూర్తిగా చెల్లించిన వారికి అపరాధ రుసుము మాఫీ చేస్తున్నట్లు ఇటీవల కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజులలో కూడా పన్ను వసూలు కేంద్రాలు అందుబాటులో ఉండటంతో పన్ను చెల్లించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు వస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కౌంటరును ఏర్పాటు చేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు. పన్నును నగర పాలక సంస్థ కార్యాలయం, వార్డు సచివాలయం, ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని ఆయన తెలిపారు.



పన్ను వసూలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్

ఎగువ అహోబిలంలో గరుడోత్సవం

ముగిసిన బ్రహ్మోత్సవాలు



దిగువ అహోబిలంలో ప్రహ్లద వరదస్వామికి చక్ర స్నానం నిర్వహిస్తున్న వేద పండితులు



ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహ స్వామి గరుడోత్సవ దృశ్యం

ఆళ్లగడ్డ, మార్చి 26: అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎగువ అహోబిలంలో పన్నెండో రోజు మంగళవారం జ్వాలా నరసింహస్వామికి గరుడోత్సవం నిర్వహిం చారు. ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఈనెల 25వ తేదీన ముగిశాయి. అయితే స్వామి వారి గరుడోత్సవం ఈ నెల 25వ తేది అర్ధరాత్రి వరకు కొనసాగాయి. బ్రహ్మోత్సవాలలో స్వామి వారు వివిధ వాహన సేవలపై భక్తులకు దర్శనం ఇచ్చారు.

దిగువ అహోబిలంలో..

అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా దిగువ అహోబిలంలో మంగళవారం ప్రహ్లాద వరదస్వామికి అవ భృత, తీర్థవారి చక్రస్నానం కార్యక్రమాలను నిర్వహించారు ముందుగా ప్రహ్లాద వరదస్వామికి ఉత్సవం, ద్వాదశారాధనం, పుష్ప యాగం, గరుడోత్సవం కార్యక్రమాలను వేదపండితులు చేపట్టారు..

నేడు దిగువ అహోబిలంలో..

దిగువ అహోబిలంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు పహ్లాద వరదస్వామికి తెప్పోత్సవ కార్యక్రమాన్ని వేదపండితులు చేపట్టనున్నారు.

ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు

డిశ్చార్జ్ అయిన తల్లీ బిడ్డలు

కర్నూలు(హాస్పిటల్), మార్చి 26: ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది ఓ తల్లి. కల్లూరు మండలం సల్కాపురం గ్రామానికి చెందిన పవన్ కుమార్ భార్య సుష్మారాణి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుగా పని చేస్తున్నారు. ఆమె ఈ నెల 6వ తేదీన మొదటి కాన్పు కోసం కర్నూలు జీజీహెచ్ గైనిక్ విభాగంలోని 3వ యూనిట్‌లో అడ్మిట్ అయ్యారు. యూనిట్ చీఫ్ డా.సావిత్రీ సుధాకర్ పరీక్షలు నిర్వహించారు. బీపీ ఎక్కువ కావడంతో 15 రోజులుగా వార్డులోనే ఉంచి చికిత్స అందించారు. చివరకు ఈ నెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు గర్భిణికి ప్రొఫెసర్ డా.సావిత్రి, అసోసియేట్ ప్రొఫెసర్ కుముద, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుగుణశ్రీ, రేవతి అనస్థీషియా వైద్యులు శ్రీలత బృందం సిజేరియన్ ఆపరేషన్ చేశారు. నిమిషం వ్యవధిలో వరుసగా ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. మొదటి ఆడ శిశువు 1.9 కేజీలు ఉండగా, మిగిలిన మగపిల్లలు 1.5 కేజీలు ఒకరు, మరొకరు 1.9 కేజీలు ఉన్నారు. తల్లీ పిల్లలు ఆరోగ్యంగా ఉన్నట్లు డా.సావిత్రి సుధాకర్ తెలిపారు. వారిని మంగళవారం డిశ్చార్జ్ చేశామన్నారు.



తల్లి, ముగ్గురు పిల్లలతో గైనిక్ మూడో యూనిట్ వైద్యురాలు




కర్నూలు ఐదు రోడ్ల కూడలిలో పని కోసం అడ్డా కూలీల నిరీక్షణ

నేతలది ఓట్ల వేట.. పేదలది బతుకు బాట

కర్నూలు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్మాణ రంగంపై ఆధార పడుతున్న అడ్డా కూలీల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. ఈ ఏడాది వర్షాభావం పరిస్థితుల వల్ల గ్రామ సీమల్లో తీవ్ర కరువు దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. పశ్చిమ ప్రాంతం నుంచి లక్షల కుటుంబాలు తెలంగాణ, గుంటూరు, పల్నాడు ప్రాంతాల్లో పత్తితీత, మిరప కోత పనులకు వలస వెళ్లారు. పట్టణ, నగర శివారు గ్రామాల్లో రైతులు అడ్డా కూలీలుగా మారుతున్నారు. జిల్లాలో భవన నిర్మాణం సహా ఇతర పనులపై ఆధారపడిన అసంఘటిత కార్మికులు సుమారు 5.45 లక్షల మందికిపైగా ఉన్నారు. వారిలో సగానికి పైగా అడ్డా కూలీలే. ఐదేళ్ల క్రితం ఆనాటి చంద్రబాబు ప్రభుత్వంలో ఉచిత ఇసుక పాలసీ అమలు చేశారు. పుష్కలంగా ఇసుక లభించడంతో నిర్మాణ రంగం కళకళలాడేది. ఉచితంగా దొరికే ఇసుకకు కూడా టన్ను రూ.450 రేటు కట్టి ఇసుక రీచులను తన వాళ్లకే జగన్ ప్రభుత్వం అప్పగించింది. దీంతో కృత్రిమ ఇసుక కొరతను సృష్టించి డిమాండ్ పెంచడంతో నిర్మాణ రంగం కుదేలైంది. పనులు దొరక్క అడ్డా కూలీలు నానా అవస్థలు పడుతున్నారు. పాలకులకు మాత్రం ఈ కూలీల కష్టాలు పట్టడం లేదనే విమర్శ ఉంది.

పని దొరికితే పండగే..



కర్నూలు నగరంలో రైల్వే స్టేషన్ రోడ్ ఐదు రోడ్ల కూడలి, సీ క్యాంప్, గడియారం ఆస్పత్రి, నంద్యాల చెక్ పోస్టు, ఠాగూర్ నగర్, చెన్నమ్మ సర్కిల్, గుత్తి పెట్రోల్ బంక్ వద్ద అడ్డాలు ఉన్నాయి. నగరం నుంచే కాకుండా కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు, కోడుమూరు, దేవనకొండ, నందికొట్కూరు, గూడూరు మండలాల నుంచి పనులు కొసం ఈ అడ్డాలకు కూలీలు, రైతులు కూడా వస్తున్నారు. రోజు సరాసరి పది వేల మంది కూలీలు తెల్లారగానే 6 గంటలకే అడ్డాకు చేరుకుంటారు. పనులు దొరికితే ఆ రోజు పండగే.. లేదంటే మధ్యాహ్నం 11-12 గంటల వరకు నిరీక్షించి తెచ్చుకున్న సద్దెన్నం తిని ఇంటిదారి పడుతున్నారు. పని ఉన్నా.. లేకున్నా చార్జీలు, ఇతర ఖర్చులు రూపంలో రోజుకు రూ.100-150 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒక్కో రోజు చార్జీలకు అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఊళ్లో తనకు ఐదెకరాల పొలం ఉంది. పత్తి సాగు చేస్తే అప్పే మిగిలింది. పూట గడవడం కష్టంగా మారడంతో నెల రోజులుగా పని కోసం అడ్డాకు వస్తున్నా. మొదటి రోజు పని దొరకలేదు.. చార్జీకి డబ్బుల్లేక.. చార్జీ కోసం అప్పు అడగలేక మా ఊరికి నడిచివెళ్లాలని గూడూరు మండలానికి చెందిన వెంకటేశ్వర్లు అనే రైతు వాపోయారు.

- ఊళ్లలో చేద్దామంటే పనుల్లేవు
- అడ్డాకొస్తే పని దొరుకుతుందన్న గ్యారెంటీ లేదు
- ఓట్ల కోసం వచ్చే నాయకులకు మా కష్టాలు పట్టవా?
- కర్నూలు అడ్డా కూలీల కన్నీటి వ్యథ

ఏం చేశామని ఓట్లు అడుగుతారు?

'ఊళ్లో పనులు లేవు.. ఉపాధి హామీ పనులకు వెళ్దామంటే ఆ కూలీ డబ్బులు ఎప్పుడిస్తారో గ్యారెంటీ లేదు. వారంలో రెండు మూడు రోజులు పని దొరికినా రూ.1,500 వస్తుంది. చార్జీలు, ఖర్చులు పోను వారం వారం రూ.వెయ్యి ఇంటి ఖర్చులకు వస్తుందని అడ్డాకు వస్తే ఇక్కడా పని దొరకడం కష్టంగా మారింది. దీనంతటికి ప్రధాన కారణం ఇసుక కొరతే. పేదలను మరింత కష్టాల్లోకి నెట్టేస్తున్న ఈ ప్రభుత్వం ఏం చేశామని ఓట్లు అడుగుతారు..? జగన్ నమ్ముకొని మళ్లీ మోస పోలేం' అని కూలీలు అంటున్నారు.

పని దొరికితే పండుగే



మా ఊళ్లో పనులు లేవు. భవన నిర్మాణ పనులకు వెళితే రోజు రూ.500-600 వస్తాయని, ఇంటికి ఖర్చులకు ఇబ్బంది ఉండదని రోజు ఉదయం ఆరు గంటలకే ఆర్ఎస్ రోడ్డు ఐదు రోడ్ల కూడలి అడ్డాకు రావడం.. మధ్యాహ్నం 12 గంటల వరకు నిరీక్షించి ఇంటికి వెళ్లడం నిత్యకృత్యమైంది. ఈ ఏడాది పనులు లేక అవస్థలు పడుతున్నాం. ఇప్పుడు ఎలక్షన్లు వచ్చాయని ఓట్ల కోసం వస్తారు.. ఆ తరువాత మా నెత్తిన చేయి పెడుతారు. వారం రోజులుగా అడ్డాకు వస్తున్నా.. ఒక్క రోజు కూడా పని దొకరలేదు. ఎట్లా బతకాలయ్యా..?

- మద్దిలేటి, నిడ్జూరు గ్రామం, కర్నూలు మండలం

వారంలో రెండ్రోజులు కూడా పని ఉండదు



మా ఊరు ఇక్కడికి 50 కిలోమీటర్లు ఉంటుంది. చేద్దామంటే ఊర్లో ఉపాధి పనులు లేవు. చేసినా కూలీ ఎప్పుడిస్తారో తెలియడం లేదు. దీంతో రోజు కర్నూలు అడ్డాకు వస్తున్నాను. వారంలో రెండు రోజులు కూడా పని దొరకడం లేదు. రోజు రానుపోనూ బస్సు చార్జీ, ఆటోలకు రూ.100 ఖర్చు అవుతుంది. పని లేకపోతే పస్తులతో కాలం గడపాల్సిన పరిస్థితి మాది. ఈ ప్రభుత్వం ఏమాత్రం అదుకోవడం లేదు.

- గిడ్డయ్య, పి.కోటకొండ గ్రామం, దేవనకొండ మండలం

మా ఓట్లు తప్ప కష్టాలు పట్టవా?



రాజకీయ నాయకులకు మా ఓట్లు కావాలి. పేదల కష్టాలు మాత్రం పట్టవు. ఈ ఏడాది కరువు వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఊళ్లో పనులు లేవు. అడ్డాకు వస్తే పని దొరకుతుందన్న గ్యారెంటీ లేదు. రోజు కష్టపడితే రూ.500-600 వస్తుంది. అందులో చార్జీలకే రూ.100 పోతుంది. వారంలో కనీసం నాలుగు రోజులు పని దొరికితే ఆకలి తీరుతుంది. లేదంటే పస్తులతో గడపాల్సిన పరిస్థితి.

- రమణ, మండ్లెం గ్రామం, నందికొట్కూరు మండలం

29న చంద్రబాబు పర్యటన వాయిదా

ఆత్మకూరు, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భాగంగా ఈ నెల 29న ఆత్మకూరు పట్టణంలో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన వాయిదా పడినట్లు శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మంగళవారం తెలిపారు. 29వ తేదీ గుడ్‌ఫ్రైడే, పవిత్ర రంజాన్ మాసంలోని శుక్రవారం కావడంతో చంద్రబాబు పర్యటనను వాయిదా వేయాలని కోరినట్లు చెప్పారు. ఏప్రిల్ నెలలో ఆత్మకూరులో చంద్రబాబు పర్యటనకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పది పరీక్షలకు 1077 మంది గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 26: పదో తరగతి పరీక్షల్లో మంగళవారం జిల్లాలో మంగళవారం 1077 మంది గైర్హాజర్ అయ్యారని విద్యాశాఖ అధికారి శామ్యూల్ తెలిపారు. మొత్తం విద్యార్థులు 34,929 మంది పరీక్షలకు నమోదు చేసుకోగా 33,852 మంది హాజరయ్యారని, 1077 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు. జిల్లా పరిశీలకుల అధికారి గీత నాలుగు పరీక్ష కేంద్రాలను, జిల్లా విద్యాశాఖ అధికారి ఒక పరీక్ష కేంద్రాన్ని, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 7, సిట్టింగ్ స్క్వాడ్‌లు 44 పరీక్ష కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. ఎటువంటి మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదని డీఈవో తెలిపారు.

చెల్లికి న్యాయం చేయని వ్యక్తి రాష్ట్రానికేం చేస్తారు?

సోమిశెట్టి వెంకటేశ్వర్లు




కర్నూలు(అర్బన్), మార్చి 26: వైఎస్ వివేకా హత్యకేసులో సీబీఐ అవినాష్‌రెడ్డి దోషి ని తేల్చాక చర్యలు తీసుకొని సొంత చెల్లికి న్యాయం చేయాల్సిన సీఎం జగన్ ఆ పని చేయలేదని, అలాంటి వ్యక్తి రాష్ట్ర ప్రజలకు ఏం న్యాయం చేస్తారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ జిల్ల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినాష్‌రెడ్డిని ఆరెస్టు చేసి విచారిస్తే వివేకా హత్యకేసులో నిజానిజాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఐదేళ్ల అధికారంలో ఉండి బాబాయ్ హత్యకేసులో నిందితులను తేల్చలేని వ్యక్తికి పరిపాలించే అర్హత్ లేదన్నారు. గత టీడీపీ హయంలో పెట్టుబడుల్లో ఏపీ నెంబర్ వన్ స్థానంలో ఉంటే ప్రస్తుత జగన్‌రెడ్డి పాలనలో డ్రగ్స్, గంజాయి దిగుమతులు, ఎగుమతుల్లో నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు.

హుండీ లెక్కింపు

మహానంది, మార్చి 26: మహానంది అభిషేక మండపంలో మంగళవారం ఉభయ ఆలయాల హుండీలని లెక్కించారు. విరాళాలుగా రూ.38,37,413 వచ్చాయని ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గత 33 రోజులకుగాను ఆలయాల హుండీల నుంచి రూ.37,86,188, అన్నప్రసాదం హుండీ నుంచి రూ.33,325, గోవు సంరక్షణ హుండీ నుంచి రూ.17900, యుఎస్ఎ డాలర్స్ రెండు, శ్రీలంక 20 రూపాయలు, నేపాల్ 10 రూపాయలు ఒకటి, దుబాయి ఒక రియాల్ వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో వెలుగోడు గ్రూప్ దేవాలయాల ఈవో జనార్దన్, దేవస్థానం ఏఈఓలు మధు, వెంకటేశ్వరుడు, అర్చకులు, కర్నూలు తిరుమల బాలాజీ సేవా సమితి, కర్నూలు బాలాజీ సేవా ట్రస్టు సేవకులు హాజరయ్యారు.

అవినీతికి పరాకాష్ఠ జగన్ ప్రభుత్వం

డీసీసీ అధ్యక్షుడు జె. లక్ష్మీనరసింహ యాదవ్


మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ, ఆర్థర్

నంద్యాల టౌన్, మార్చి 26: రాష్ట్రంలో ఐదేళ్ల జగన్ ప్రభుత్వ పాలన అవినీతికి, విధ్వంస, వినాశకర పాలనకు పరాకాష్ఠగా మారిందని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె. లక్ష్మీనరసింహ యాదవ్ ధ్వజమెత్తారు. మంగళవారం నంద్యాలలోని డీసీసీ కార్యాలయంలో నందికొట్కూరు ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్‌తో కలిసి విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో ఏపీ 40 ఏళ్ళ వెనక్కి తిరోగమించిందని విమర్శించారు. సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టి ప్రజలపై మోయలేని భారాన్ని మోపారని, జగన్ మాయమాటలను మరోసారి నమ్మి మోసపోవద్దని ప్రజలకు పిలుపు ఇచ్చారు. నంద్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో చేసిన అభివృద్ధే తప్ప జగన్ ప్రభుత్వంలో ఏ ఒక్క అభివృద్ధీ జరగలేదని విమర్శించారు.

తీవ్రంగా అవమానించారు? : తోగూరు ఆర్థర్

వైసీపీలో తనను తీవ్రంగా అవమానించారని నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ వైసీపీ అధినేత జగన్ తీరుపై విరుచుకుపడ్డారు. అవమానాలకు గురి చేసి తన హక్కులను కూడా ఇతరులకు బదిలీ చేయడంతో వైసీపీకి గుడ్‌బై చెప్పాల్సి వచ్చిందని అన్నారు. వైసీపీకి రాజీనామా చేశాక ఎంతో మంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, పలువురు ప్రముఖులు తనతో మాట్లాడారని, తన నిర్ణయం సరైనదేనని అన్నారని అన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలను తమ తాత ముత్తాతలందరూ పాటిస్తూ పార్టీలో సైనికుల్లాగా పని చేశారని అన్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశిస్తే ఏ పని చేయడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.

జగన్ పార్టీని చిత్తుగా ఓడించాలి



కర్నూలు(అర్బన్), మార్చి 26: 2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నేరవేర్చని జగన్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కోడుమూరు అభ్యర్థి బొగ్గుల దస్తగిరితో కలిసి విలేఖర్లతో మాట్లాడుతూ మద్య నిషేధం, టిడ్కో ఇళ్లు ఇవ్వకపోవడం, విద్యుత్ చార్జీలు పెంచడం, పన్నుల భారం మోపడం, నిత్యావసర వస్తువుల ధరలు పెంచడం, జాబ్ క్యాలండర్ విడుదల చేయకపోవడం, 2.30 లక్షల ఉద్యోగాల భర్తీ మాట తప్పడం, మెగా డిఎస్సీని దగా డిఎస్సీగా మార్చడం, నిరుద్యోగ యువతను రోడ్డు పాలు చేయడం, గ్రీన్ ట్యాక్స్, మద్యం ధరలు పెంచి లక్షల కోట్లు దోచేయడం వంటి పనులు చేసిన వైసీపీని రాబోయే ఎన్నికల్లో ఓడించాలని అన్నారు. నిరుద్యోగ భృతి, విదేశీ విద్య, చంద్రన్న బీమా, రైతు రుణ మాఫీ, అన్నదాత సుఖీభవ, పసుపు కుంకుమ, ఆదరణ లాంటి సంక్షేమ పథకాలు రద్దు చేసి జగన్‌రెడ్డి లక్ష కోట్ల సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించారని మండి పడ్డారు. బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని కోరారు.

లిక్కర్ డంప్ స్వాధీనం

- రూ.5.40 లక్షల మద్యం స్వాధీనం
- ఒకరి అరెస్టు

ఆలూరు, మార్చి 26 : ఆలూరు సెబ్ పరిధిలోని చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామకొండల్లో నిలువ ఉంచిన భారీ మద్యం డంప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ జిల్లా సూపరింటెండెంట్ రవికుమార్ మంగళవారం తెలిపారు. ఈ మద్యం విలువ రూ.5.40 లక్షలు ఉంటుందన్నారు. ఈ కేసులో రామదుర్గం గ్రామంలో నివాసం ఉంటున్న బెల్లి మల్లికార్జున పాత్ర ఉన్నట్లు విచారణలో గుర్తించామని అన్నారు. ఆయన ఇంట్లో ఉన్న మద్యం బాక్సులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆయనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం సాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉంచి కర్ణాటక మద్యం సరఫరాను నియంత్రిస్తామన్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ఇంకా ఇద్దరు వ్యక్తులను పట్టుకోవడానికి జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి నాగరాజు, డివిజనల్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో రెండు టీములను ఏర్పాటు చేశామన్నారు. దాడులలో ఆలూరు ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు ఎమ్మెల్యేపై ఫిర్యాదు

కర్నూలు, మార్చి 26: వైసీపీ మైనార్టీ సిటీ జనరల్ సెక్రటరీ సయ్యద్ జిలాన్ బాషా ఖాద్రి అనే వ్యక్తి కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, అతని అనుచరులు జాఫర్, మహబూబ్, సునీల్ అనే వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను కొన్నేళ్లుగా ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అనుచరుడిగా ఉంటున్నానని, అయితే.. ఆ నాయకత్వం నచ్చక దూరంగా ఉంటున్నానని చెప్పారు. గత ఆరు నెలలుగా ఎమ్మెల్యేతో పాటు ఆయన అనచరులు వేధిస్తున్నారని అన్నారు. సోమవారం రాత్రి ఎమ్మెల్యే అనుచరులు వచ్చి కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని, ఎమ్మెల్యే ఇంటి సమీపంలో ఉన్న తుంగభద్ర నది బ్రిడ్జి వద్ద కొట్టారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ తర్వాత మాసూంబాషా దర్గా వద్ద తనను వదిలేసి వెళ్లారని చెప్పారు. ఈ విషయమై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టూటౌన్ సీఐ ఇంతియాజ్‌బాషాకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సీఐని వివరణ కోరగా నిజనిజాలపై విచారిస్తున్నామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదిలా ఉండగా సయ్యద్ జిలాన్ బాషా ఖాద్రి తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని తిరిగి పోలీసులకు చెప్పడం కొసమెరుపు. అయితే ఎమ్మెల్యే ఒత్తిడితోనే ఇలా యూటర్న్ తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఇద్దరు వలంటీర్ల తొలగింపు

రుద్రవరం, మార్చి 26 : ఎన్నికల కమిషన్ నిబంధనలకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీతో రుద్రవరం గ్రామ వలంటీర్లు.. అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైంది. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారి రామచంద్ర స్పందించారు. రాజు, వెంకటేశ్వర్లు అనే ఇద్దరు వలంటీర్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. మరో వలంటీరు మల్లికార్జున రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నంద్యాలకు ఏ ముఖం పెట్టుకొని వస్తున్నారు?

- సీఎం జగన్‌పై టీడీపీ నాయకుల ఆగ్రహం


తంగడంచలో పైలాన్‌ను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

జూపాడుబంగ్లా, మార్చి 26: టీడీపీ హయాంలో చంద్రబాబు కంపెనీలు ఏర్పాటు చేయడానికి పునాదులు వేస్తే.. సీఎం జగన్ పట్టించుకోలేదని, ఏం ముఖం పెట్టుకొని నంద్యాల జిల్లాకు వస్తున్నారని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తంగడంచలో ఏర్పాటు చేసిన జైన్ పరిశ్రమను టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ తదితరులు మంగళవారం పరిశీలించారు. నాయకులు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం వచ్చాక పరిశ్రమలకు మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో పరిశ్రమలకు కేటాయించిన భూములు అడవిని తలపిస్తున్నా యన్నారు. ప్రశ్నించేవారే గొంతులు నొక్కడం, దాడిచేయడంపై ఉన్న శ్రద్ధ రాష్ట్ర అభివృద్ధిపై జగన్‌కు చిత్తశుద్ధిలేదని అన్నారు. నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తాజయసూర్య, సురేంద్రనాథ్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్, జంగాలపెద్దన్న, ప్రసాదరెడ్డి, మహేశ్వరరెడ్డి, నాగరాజు, సుబ్బన్న, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో 18 నెలల బాలుడి మృతి

రుద్రవరం, మార్చి 26 : వడదెబ్బతో 18 నెలల బాలుడు మృతి చెందాడు. నంద్యాల జిల్లా రుద్రవరం మండల కేంద్రానికి చెందిన రాజేశ్వరమ్మ - బ్రహ్మయ్య ఆచారి దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. తలనీలాలు సమర్పించేందుకు సోమవారం అహోబిలం వెళ్లారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తలనీలాలు సమర్పించి అదే రోజు రాత్రి ఇంటికి చేరుకున్నారు. బాలుడు లక్ష్మీనరసింహాచారికి తల్లి రాజేశ్వరమ్మ పాలు పట్టి ఊయలలో పండబెట్టింది. మంగళవారం ఉదయం నిద్రలేవకపోవడంతో స్థానికంగా ఉన్న వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే బాలుడు మృతి చెందాడని వైద్యాధికారి తెలిపారు. వడ దెబ్బ వల్లే మృత్యువాత పడినట్టు ఆయన వెల్లడించారు. దీంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

కుంగిన ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు



కుంగిన ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు చేసిన దృశ్యం

రుద్రవరం, మార్చి 26 : మండలంలోని చిన్నకంబలూరు మెట్ట సమీపంలో కుంగిన ఆర్‌అండ్‌బి రోడ్డుకు అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో కుంగిన ఆర్‌అండ్‌బీ రోడ్డు, మహిళ బలి.. అనే శీర్షిక అచ్చయిన వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. ముందే ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకుని ఉండింటే మహిళ ప్రాణం పోయేది కాదనే విమర్శలున్నాయి.

ముగ్గురు విలేకర్లపై కేసు నమోదు

ఇద్దరు విద్యార్థి సంఘం నాయకులపై కూడా..

జూపాడుబంగ్లా, మార్చి 26: ముగ్గురు విలేకరులు, ఇద్దరు విద్యార్థి సంఘం నాయకులపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నందికొట్కూరుకు చెందిన విలేకర్లు ఎం.చంద్రశేఖర్ (ఉత్తేజిత), పరమేష్(ఆంధ్రప్రభ), హుస్సేనాలం(ఉత్తేజిత), డక్కకుమార్ (ఎస్ఎఫ్ఐ), మద్రిస్వామి (పీడీఎస్‌యూ)లు ఈ నెల 25న ఎటువంటి అనుమతి లేకుండా జూపాడుబంగ్లాలోని ఎస్సీ బాలికల వసతి గృహంలోకి వెళ్లారు. వార్డెన్ ఉమాదేవి వద్దకు వెళ్లి హాస్టల్‌లో ఓ బాలిక గర్భం దాల్చిందని, ఆ అమ్మాయిని చూపించాలని అన్నారు. లేకుంటే వ్యతిరేకంగా వార్తలు రాస్తామని బెదిరించారు. అయితే వీరి వ్యవహారాన్ని చూసిన తోటి విద్యార్థినులను వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో విలేకరులు, విద్యార్థి నాయకులు విద్యార్థినులను నానాబూతులు తిట్టి భయభ్రాంతులకు గురి చేశారు. హాస్టల్ వార్డెన్ ఉమాదేవి వీరి వ్యవహార శైలిని భరించలేక పై అధికారులకు తెలిపింది. వారి సూచన మేరకు సోమవారం పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మేరీ జయంతి తెలిపారు. ఈ విషయంపై సదరు విలేకరులు, విద్యార్థి సంఘం నాయకులను వివరణ కోరగా బాలిక గర్భం దాల్చినట్లు తమ దృష్టికి రావడంతో వసతి గృహం వద్దకు వెళ్లామని, దీంతో వార్డెన్ తమపై ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.



ఓటు వేయడం మనందరి బాధ్యత: ఆర్‌ఓ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఓ ఎ. భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), మార్చి 26: ఓటు వేయడం మనందరి బాధ్యత అని కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) ఎ.భార్గవతేజ అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ప్రకాష్ నగర్, రోజా వీధి, రాధాకృష్ణ ఆసుపత్రి, మోడరన్ ఫంక్షన్ హాల్, అంబికా శిశుకేంద్రం, టంగుటూరు ప్రకాశం పంతులు స్మారక పాఠశాల, మదర్ థెరిసా కూడలి వరకు ఓటు హక్కు వినియోగంపై ఆర్‌పీ, సీఓలు, పొదుపు మహిళలతో కలిసి ఆయన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ ఎ.భార్గవతేజ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో ప్రాధాన్యం ఉందని, అర్హులందరూ తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్‌కుమార్, అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు ధనుంజయ, సోషల్ డెవలప్‌మెంట్ స్పెష లిస్టు పెంచలయ్య, ప్రత్యేకాధికారి మంజూర్ బాషా పాల్గొన్నారు.

ప్రమాదాలను పట్టించుకోరా?

పీపీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి

కర్నూలు(న్యూసిటీ), మార్చి 26: నగరంలోని బళ్లారి చౌరస్తా నుంచి కృష్ణానగర్ జాతీయ రహదారి వరకు ప్రతిరోజూ ప్రమాదాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోరా అని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి ప్రశ్నించారు. మంగళవారం కమిటీ బృందంతో కలిసి రహదారిని పరిశీలించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతిరోజూ రవాణా రంగంపై వందల కోట్లు టోల్ రూపంలో వసూలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజల రక్షణ ఎందుకు పట్టించుకోవడం లేదని అన్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్లు, నదులపై బ్రిడ్జిలు, లైట్లు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. సర్వీసు రోడ్లు పూర్తి చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రెండు నెలలుగా హంద్రీ బ్రిడ్జి మరమ్మతుల పేరుతో ట్రాఫిక్‌ను మళ్లించడంతో జరిగే ప్రమాదా లకు, ప్రజల ఇబ్బందులకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తుందా అని ప్రశ్నించారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి బ్రిడ్జి మరమ్మతులు, సర్వీసు రోడ్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సీవీ వర్మ, ఎ.వెంకటేశ్వర్లు, ఎస్.రమణగౌడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

ఓర్వకల్లు, మార్చి 26: మండలంలోని కాల్వ గ్రామంలో మహ్మద్ షాఖాద్రి ఉరుసు సందర్భంగా మంగళవారం నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయనకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, దర్గా నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. దర్గా గురువు షాబు ద్దీన్ ఖాద్రి గౌరు వెంకటరెడ్డికి శాలువలు, పూలమాలలతో సన్మానించారు. మహిళలు భక్తులు స్వాముల వారికి ఫతేహాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రజాక్‌బాషా, ఖాదర్, గోకారి, శాలు, హుశేన్ బాషా, మౌలాలి, సుల్తాన్ పాల్గొన్నారు.

ఘనంగా పారువేట

సి.బెళగల్, మార్చి 26: మండలంలోని పోలకల్లు గ్రామంలో చెన్న సోమేశ్వరస్వామి జాతర సందర్భంగా మంగళవారం పారువేట, వసంతోత్సవం, పొట్టేళ పందెం ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా అన్నదానం చేశారు. వసంతోత్సవంలో భాగంగా స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు.

విజేతలకు బహుమతి ప్రదానం: బండలాగుడు పోటీల విజేతలకు గుండాల హోటల్ గోవిందు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులపై దాడులను అరికట్టాలి

కర్నూలు(న్యూసిటీ), మార్చి 26: రాష వ్యాప్తంగా ఇటీవల బ్రాహ్మణులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటరామరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ శివాలయంలో అర్చకుడిపై జరిగిన దాడిని సమాఖ్య తీవ్రంగా ఖండి స్తుందన్నారు. దాడికి పాల్పడిన మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రశేఖర్‌ను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అర్చకులు సాయి శర్మ, విజ యకుమార్ శర్మ మనోధైర్యంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. వైసీపీ ప్రభు త్వ హయాంలోనే బ్రాహ్మణలపై దాడులు ఎక్కువయ్యాయని అన్నారు. అర్చకు లపై దాడి చేసిన వారిపై అట్రాసిటి కేసు నమోదు చేయాలన్నారు.

వైసీపీ నాయకుడిపై కేసు నమోదు చేయాలి

కర్నూలు(కల్చరల్), మార్చి 26: కాకినాడలో పెద్ద శివాలయం అర్చకులు వెంకట సత్యసాయి శర్మ, విజయకుమార్ శర్మలపై దాడి చేసిన వైసీపీ మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రరావుపై కేసు నమోదు చేయాలని అఖిల భారత బ్రాహ్మణ మహా సంఘం జిల్లా అధ్యక్షుడు దేవెళ్ల సాయినాథ శర్మ ఒక ప్రకటన లో డిమాండ్ చేశారు. అర్చకులపై ఇటీవల దాడులు, దౌర్జన్యాలు పెరిగి పోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య ఏదైనా ఉంటే ఆలయ కమిటీ ప్రతినిధులతో చర్చించాలే తప్ప, గర్భగుడిలో ఉన్న అర్చకులపై భౌతిక దాడి చేయడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. అఖిల భారత బ్రాహ్మణ మహా సంఘం పక్షాన బాధితులకు అండగా ఉంటామన్నారు.

'లీజు అగ్రిమెంట్ చేయండి'

కర్నూలు(కల్చరల్), మార్చి 26: నగర శివారులోని జగన్నాథగట్టు భూమిని ఇస్కాన్ టెంపుల్‌కు లీజు అగ్రిమెంట్ వెంటనే చేపట్టాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోరంట్ల రమణ, మాళిగి భానుప్రకాశ్ కోరారు. మంగళవారం దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డిని కలిసి ఈ విషయంపై వారు చర్చించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా సహ కార్యదర్శులు గోవిందరాజులు, గూడూరు గిరిబాబు, ఈపూరి నాగరాజు పాల్గొన్నారు.

29, 30 వార్డుల్లో టీడీపీ ప్రచారం


సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తున్న గౌరు జనార్దన్‌రెడ్డి

కల్లూరు, మార్చి 26: పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత గెలుపు కోసం ఆమె కుమారుడు జనార్దన్‌రెడ్డి మంగళవారం ప్రచారం చేశారు. కల్లూరు అర్బన్ 29, 30 వార్డుల్లో ఇంటింటికీ తిరిగి టీడీపీ మెనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. మహిళల కోసం నూతన పథకాలను ప్రకటించారని, నిరుద్యోగ యువతకు ప్రాధాన్యం చేకూర్చారని, రైతులు, చదువుకునే బిడ్డలకు పథకాలను ప్రకటించారని కరపత్రాలను పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో గౌరు చరితను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి కె.శ్రీనివాసరావు, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, పుల్లయ్యగౌడ్, బీసన్న, చంద్ర మౌళీశ్వరరెడ్డి, జన సేన నాయకుడు తిరుమలేష్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

కర్నూలు అభ్యర్థి టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 26: నగరంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ పిలుపునిచ్చారు. మంగళవారం మౌర్యఇన్‌లోని టీజీ భరత్ కార్యాలయంలో నగరంలోని 42వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు ఫయాజ్, శేఖర్, రవి, మధు, మధు యాదవ్, ఇబ్రహీం, ఇస్మాయిల్, ఖాజా తది తరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీజీ భరత్ వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ నగరంలోని పలు వార్డుల్లో టీడీపీ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. కీలక నాయకులు, కార్యకర్తల రాకతో పార్టీకి ఎంతో లాభం చేకూరుతుందన్నారు. టీడీపీలోనే ప్రజలకు న్యాయం జరుగు తుందన్నారు. మహిళలు, యువతకు టీడీపీ సూపర్ సిక్స్ పథకాల మేనిఫెస్టోతోపాటు తాను స్వయంగా రూపొందించిన 6 గ్యారెంటీల ద్వారా ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి


టీడీపీలో చేరిన నాయకులతో టీజీ భరత్

అబ్దుల్ రజాక్, టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, జనసేన అసెంబ్లీ ఇన్‌చార్జా హర్షద్, కార్పొరేటర్ క్రైపా పద్మాలతారెడ్డి, మొయిన్, వార్డు ఇన్‌చార్జిలు వలి, హరి, తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ శాతాన్ని పెంచాలి: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 26: గత ఎన్నికల పోలింగ్ శాతం కంటే మెరుగైన శాతాన్ని సాధించేలా బీఎల్వోలు కృషి చేయాలని కలెక్టర్ జి.సఅజన అన్నారు. మంగళవారం దేవీ ఫంక్షన్ హాలులో పాణ్యం నియోజకవర్గం, జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కోడుమూరు నియోజకవర్గానికి సంబంధించి సాధారణ ఎన్నికలు-2024 నిర్వహణపై బూత్ లెవెల్ స్థాయి అధికారులకు, సెక్టోరల్ అధికారులకు, ఎంసీసీ బృందాలకు నియోజకవర్గ స్థాయిలో జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, పాణ్యం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కోడుమూరు ఆర్వో శేషిరెడ్డితో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నిక లపై పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి అవగాహన కల్పించేందుకు గానూ ప్రతి నియోజకవర్గంలో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఎస్పీ జి.కృష్ణ కాంత్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నిర్వహణ సజావుగా నిర్వహిం చేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈసమావేశంలో పట్టణ డీఎస్పీ రాజశేఖర్‌బాబు, ట్రైనీ డీఎస్పీ భావన, కల్లూరు తహసీల్దార్ మునివేలు, ఓర్వకల్లు గడివేముల, కోడుమూరు ఎంపీడీవోలు, తహసీ ల్దార్లు, వీఎస్‌టీ, ఎస్ఎఫ్‌టీ, బీఎల్వోలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు : వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో తాగునీటి సమస్య రాకుండా చేపట్టాల్సిన చర్యలపై పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, నగర పాలక సంస్థ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. ఎల్లెల్సీ నుంచి ఆధారపడిన సీపీడబ్ల్యూఎస్ పథకానికి సంబంధించి నీటిని విడుదల చేసుకుని 16 ఎస్ఎస్ ట్యాంకులలో నీటిని స్టోరేజీ చేసుకుంటున్నారా..? ఒక వేళ ఎల్లెల్సీ నుంచి నీరు రాకపోయినా ఎస్ఎస్



మాట్లాడుతున్న కలెక్టర్ జి. సృజన

ట్యాంకులలో స్టోర్ చేసుకున్న నీటిని ఎన్ని రోజుల వరకు ఉపయోగించుకోవచ్చు అనే వివరాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మొత్తం ఎన్ని హ్యాబిలిటేషన్స్ ఉన్నాయి.. అందులో జూన్ నెల చివరి వరకు ప్రతి రోజు నీటిని ఎన్ని హ్యాబిటేషన్స్‌కి ఇవ్వగలం, రోజు మార్చి రోజు ఎన్ని హ్యాబిటేషన్స్‌కి ఇవ్వగలం, ఏ సోర్సెస్ ద్వారా ఇవ్వాలనే విషయాలను ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, జిల్లా పరిషత్ అధికారులు సమన్వయం చేసుకుని రేపటి లోపు వివరాలను తనకు అందజేయాలన్నారు. మండలాల్లో ఎన్ని బోర్లు ఉన్నాయి.. అందులో ఎన్ని రిపేర్లు ఉన్నాయి.. రిపేర్ ఉన్న వాటిలో రిపేర్ చే యిస్తే.. ఎన్ని పని చేస్తాయనే వివరాలను కూడా అందజేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి పనులలో మొదటి ప్రాధాన్యతగా ఏప్రిల్‌లో కూలీలతో అన్ని హ్యాబిటేషన్ ప్రాంతాలలో వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, ఆర్‌డబ్లూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, డీపీవో నాగరాజు నాయుడు పాల్గొన్నారు.

రాక్షస పాలనకు అంతం తప్పదు

పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత


టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్న గౌరు చరిత

కల్లూరు, మార్చి 26: రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తున్న వైసీపీకి అంతం తప్పదని పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 20వ వార్డులోని శ్రీనగర్‌కాలనీ, వెంకటరెడ్డితోట, గఫూర్‌నగర్‌లో శంఖారావంలో భాగంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా, పోలవరం, విభజన హామీలు సాధిస్తానని ప్రగల్భాలు పలికిన జగన్ ఆ దిశగా ప్రయత్నం చేయక కేసులు భయంతో సాగిలాపడ్డారని విమర్శించారు. వైసీపీ అధికారంలోకి రావడంతో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని గౌరుచరిత స్పష్టం చేశారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి, మాండ్ర నరేంద్రనాథ్‌రెడ్డి, పెరుగు దుర్గాప్రసాద్‌రెడ్డి, నాగేంద్ర, వంగాల జనార్దన్‌రెడ్డి, శ్రీరాములు అయ్యస్వామి, జనసేన నాయకుడు ప్రవీణ్, నాగముని, కాసాని మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

పోలీసులకు డీజీపీ కమాండేషన్ పతకాలు

కర్నూలు, మార్చి 26: ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లా పోలీసులకు డీజీపీ కమాండేషన్ డిస్క్ పతకాలు లభించాయి. 2022 సంవత్సరానికి సిల్వర్, కాంస్యం విభాగాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఈ పతకాలను ప్రకటించింది.

- **సిల్వర్ విభాగంలో:** జి.కృష్ణకాంత్, (జిల్లా ఎస్పీ కర్నూలు), చెన్నయ్య (హెచ్‌సీ, సీ.బెళగల్), సుభాన్ (హెచ్‌సీ, ఆదోని వన్‌టౌన్), చంద్రశేఖర్ (హెచ్‌సీ, శిరివెళ్ల), షేక్ ఇబ్రహీం (హెచ్‌సీ, కోవెలకుంట్ల), సీ వెంకటరమణ (పీసీ, సెకండ్ బెటాలియన్), లక్ష్మణ్ సింగ్ (పీసీ సెకండ్ బెటాలియన్).
- **కాంస్య విభాగంలో:** కే మల్లికార్జున (ఎస్ఐ, కర్నూలు), నాగరాజు (హెచ్‌సీ, ఎమ్మిగనూరు), ఎస్.నాగరాజు (పీసీ, సీసీఎస్), కాశీం (పీసీ ఆదోని తాలుకా), రామక్రిష్ణ (పీసీ, కోడుమూరు), రమేష్ (పీసీ, సీ.బెళగల్), చంద్రబాబు నాయుడు (పీసీ, ఎమ్మిగనూరు), నరేంద్ర (పీసీ, ఆదోని త్రీటౌన్), భాస్కర్ (పీసీ, కర్నూలు), తిప్పేస్వామి (డీఎస్పీ, నంద్యాల), వి.నాగరాజు (హెచ్‌సీ, నందికొట్కూరు), జి.రమేష్ (పీసీ, ఎస్‌టీ, నంద్యాల), మధుసుధాకర్ (పీసీ, నంద్యాల త్రీటౌన్), గురుబాబు (పీసీ, బేతంచెర్ల), క్రిష్ణమూర్తి (పీసీ, నంద్యాల), పెద్దస్వామి, (పీసీ, నంద్యాల), శ్రీనివాసులు (హెచ్‌సీ, నంద్యాల)., శివశంకర్ రెడ్డి (ఆర్ఎస్ఐ, సెకండ్ బెటాలియన్), అయ్యన్న (ఏఆర్ఎస్ఐ, సెకండ్ బెటాలియన్), క్రిష్ణయ్య (ఏఆర్ఎస్ఐ, సెకండ్ బెటాలియన్), గోపాల్ (ఏఆర్ఎస్ఐ, సెకండ్ బెటాలియన్), సుందర్‌రాజు (ఏఆర్ఎస్ఐ, సెకండ్ బెటాలియన్), ప్రహ్లాదరావు (హెచ్‌సీ, సెకండ్ బెటాలియన్).

ఆసుపత్రిలో త్వరలో పేపర్‌లెస్ ప్రక్రియ


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వి. వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్), మార్చి 26: కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో త్వరలో పేపర్‌లెస్ ప్రక్రియ ద్వారా డిజిటలైజేషన్ యూహెచ్ఐడీ ద్వారా రోగులకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియ జరుగుతుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డి అన్నారు. మంగళవారం ధన్వంతరీ హాలులో ఆరోగ్యశ్రీ ఈ-హాస్పిటల్‌పై హెచ్‌వోడీలతో అయన సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులకు సంబంధించిన యూహెచ్ఐడీ 11 అంకెల నెంబరు కేషీట్‌ను పరీక్షలను రెగ్యులర్‌గా మెయింటెన్ చేయాలని ఆదేశించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరాలజీ, డెర్మాటాలజీ విభాగాలకు ఆరోగ్యశ్రీ నెల టార్గెట్‌ను పెంచుతున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ, పల్మనాలజీ, ఫ్యామిలీ ప్లానింగ్ ఐడీ విభాగాలు ఈ-హాస్పిటల్‌సలో వంద శాతం పురోగతి సాధించారని హెచ్‌వోడీలను ఆయన అభినందించారు. ఈసమావేశంలో కర్నూలు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ హరిచరణ్, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, ఆర్ఎంవో వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ శివబాల, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్ లోగో ఆవిష్కరణ



రన్‌ఫర్ జీసస్ లోగోను ఆవిష్కరిస్తున్న క్రైస్తవులు

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 26: ఈఎస్‌టీ, సిటీ పాస్టర్స్ సహకారంతో నిర్వహించే రన్ ఫర్ జీసస్ లోగోను మంగళవారం స్థానిక సీ.క్యాంపు చర్చిలోని ప్రార్థనా మందిరంలో చైర్మన్ రెవ.డా.ఆర్ఆర్‌డీ సజీవరాజు, కన్వీనర్ దాసరి సుధీర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రైస్తవులంతా ఐక్యతతో మెలగాలన్నారు. ఈనెల 30న ఉదయం 6 గంటలకు రన్ రాక్‌వుడ్ చర్చిలో ప్రారంభమై సీ.క్యాంపు ప్రార్థన మందిరంలో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రార్థన సంఘం ట్రెజరర్ రాజేంద్రప్రసాద్, రన్ ఫర్ జీసస్ కమిటీ కార్యదర్శి బి.జయాకర్, ట్రెజరర్ సురేష్, సిటీ పాస్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి దాస్, ఈఎస్‌టీ సభ్యులు జైపాల్, విజయకుమార్, నాగరాజు పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణకు ఉచిత పరీక్షలు


రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కోడుమూరు, మార్చి 26: స్థానిక ఐదో సచివాలయం పరిధిలో ప్రజలకు మొబైల్ వాహనంలో ఉచితంగా క్షయ నిర్ధారణ పరీక్షలు మంగళవారం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యులు మదనశేఖర్ ఆధ్వర్యంలో ప్రజలకు క్షయ నిర్ధారణ పరీక్షలు గత రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండగా దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, గళ్లలో రక్తం పడటం వం టి లక్షణాలు ఉంటే వైద్యులను ఆశ్రయించాలని ప్రజలకు సూచించారు. దాదాపు 124 మందికి ఉచితంగా ఎక్స్-రే తీశామన్నారు. ఇందులో 14 మందిని అనుమా నిత క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించినట్లు చెప్పారు. ఎంపీహెచ్ ఈవో నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్‌సాహెబ్, ఉమాభాయి, సిబ్బంది వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మహేష్ పాల్గొన్నారు.

'పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరి'

కర్నూలు(న్యూసిటీ), మార్చి 26: పోలింగ్ కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు తప్పకుండా ఏర్పాటు చేయాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవతేజ అన్నారు. మంగళవారం పాతకౌన్సిల్ హాలులో మౌలిక వసతుల ఏర్పాటుపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్, తాగునీరు, దివ్యాంగులు, వయోవృద్ధులు ఓటు వేసేందుకు వీలుగా ర్యాంపులు, తాత్కాలిక మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఈఈ శేషసాయి, ఇంచార్జి ఈఈ షాకీర్ హుస్సేన్, డీఈలు నరేష్, గోపాలక్రిష్ణ, గిరిరాజు, క్రిష్ణలత, రాజశేఖర్, ఏఈలు దినేష్ పాల్గొన్నారు.

- ఎన్నికల ప్రచారాలకు అనుమతి తప్పకుండా తీసుకోవాలని కర్నూలు రిటర్నింగ్ అధికారి భార్గవతేజ అన్నారు. కార్యాల యంలోని కౌన్సిల్ హాలులో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ప్రచార అనుమతులపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఏర్పాటు చేసే సభలు, సమావేశాలకు 48 గంటల ముందే అనుమతి తీసుకోవాలన్నారు. కరపత్రాల పంపకం, జెండాలు, బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగ్‌ల ప్రదర్శనకు సం బంధించి ఖచ్చితంగా ఎన్నికల మార్గదర్శకాలను పాటించాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు ఉపయోగించే వాహనాలకు తప్పకుండా పాస్ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్‌కుమార్, అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం

కర్నూలు (న్యూసిటీ), మార్చి 26: జనసేన పార్టీలో పని చేస్తున్న ప్రతి ఒక్కరికీ ఎన్నికల అనంతరం సముచిత స్థానం కల్పిస్తానని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు అన్నారు. మంగళవారం మంగళగిరి కేంద్ర కార్యాలయంలో నాగబాబుతో ఉమ్మడి కర్నూలు జిల్లా కో ఆర్డినేటర్ చింతా సురేష్ బాబు భేటీ అయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జరుగు తున్న రాజకీయాలపై చర్చించారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకునేందుకు కార్యకర్తలను సమన్వయం చేయాలని నాగబాబు సూచించారు.


జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబుతో చింతా సురేష్‌బాబు

ఎంఎల్‌హెచ్‌పీలకు కేర్ క్యాంపెయిన్ శిక్షణ


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్ కుమార్

కర్నూలు(హాస్పిటల్), మార్చి 26: మాతా శిశు సంరక్షణ, అసంక్రమిత వ్యాధుల నివారణ సేవలు గ్రామీణ ప్రాంతాల్లో బలోపేతం చేయడానికి ఎంఎల్‌హెచ్‌పీలకు కేర్ క్యాంపెనియన్ ప్రోగ్రామ్ కింద శిక్షణ ఇస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణంలోని ప్రాంతీయ శిక్షణా కేంద్రం ఫీమేల్‌లో ఎంఎల్‌హెచ్‌పీలకు ఫ్యామిలీ కేర్ టీచింగ్ విధానంపై కేర్ క్యాంపెనియన్ ప్రోగ్రామ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. 12 వారాలలోపు గర్భిణుల నమోదు, ప్రమాదకర గర్భిణులను గుర్తించాలని ఆదేశించారు. సమయానుసార రేఫెరల్ సేవలు, పిల్లల కౌమారుల ఆరోగ్య సంరక్షణ ప్రజలకు అందించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంవో ఉమా, ఆర్‌బీఎస్‌కే డీసీ శైలేష్ కుమార్, కేర్ కంపానియేన్ ప్రోగ్రాం కన్సల్టెంట్ శివశంకర్, డెమో ప్రమీలా దేవి, డీపీవో విజయరాజు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ముస్లిం మహిళలకు ఇఫ్తార్


ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లిం మహిళలు

కర్నూలు(కల్చరల్), మార్చి 26: రంజాన్ మాసంలో ఉపవాసం పాటించే ముస్లిం మహిళలకు మంగళవారం ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహిళా ఐక్య వేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత ఇఫ్తార్ ఇచ్చారు. నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో మీసాల సుమలత ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాసం పాటించే వారు తమ ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నూనె పదార్థాలకు దూరంగా ఉంటూ సులువుగా జీర్ణమయ్యే పండ్లు, ఎండు ఫలాలు, నీటి శాతం ఎక్కువగా ఉన్న ఆహారాన్ని స్వీకరించాలని తెలిపారు.

గోదా గోకులంలో విశేష పూజలు


పూజల్లో పాల్గొన్న కేఈ ప్రభాకర్ దంపతులు

కర్నూలు(కల్చరల్), మార్చి 26: నగర శివారు మామిదాలపాడులో వెలసిన గోదా రంగనాథస్వామి దేవస్థానం (గోదాగోకులం)లో మంగళవారం హనుమాన్ విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా తీర్థ గోష్టి, 27 పర్యాయాలు హనుమాన్ చాలీసా పఠనం, 11 పర్యాయాలు శ్రీరామ రక్షాస్తోత్ర పారాయణం చేశారు. హనుమంతుడికి మన్యుసూక్త హోమం, మహాజన సంకల్పం, పంచామృతాభిషేకాలు, అష్టోత్తర పారాయణాలు చేశారు. భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. గోకులం వేద పండితులు రమేష్ భట్టార్, కిరణ్ భట్టార్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, ఇందిర దంపతులను ఆలయ కమిటీ వేదాశీర్వచనంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, గోకులం సభ్యులు పాల్గొన్నారు.

సాధనతోనే పతకాలు

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 26: క్రీడాకారులు సాధన చేస్తే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించవచ్చని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జోసెఫ్ లక్ష్మయ్య అన్నారు. మంగళవారం రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించారు. స్థానిక డీఎస్ఏ స్టేడియంలో ఉన్న స్కేటింగ్ రింగ్ నుంచి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 27 నుంచి 31 వరకు జరగబోయే రాష్ట్ర స్థాయి అండర్-11, 14, 17, 19 స్కేటింగ్ క్రీడాకారులు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి ఫలితాలతో పతకాలే లక్ష్యంగా తిరిగి రావాలన్నారు. కార్యక్రమంలో స్కేటింగ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సునీల్ కుమార్, స్కేటింగ్ సంయుక్త కార్యదర్శి పునీత్ చౌదరి, స్కేటింగ్ కోచ్ ఎస్ఎండీ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

వ్యాపారులకు అండగా టీజీ కుటుంబం


మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 26: నగరంలోని వ్యాపారులకు టీజీ కుటుంబం అండగా ఉంటుందని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని చిన్న మార్కెట్ ప్రాంతంలో ఆయన భరోసా యాత్ర చేశారు. ఇళ్లు, వ్యాపార సముదాయాల వద్దకు వెళ్లి ఓటును అభ్యర్థించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న మార్కెట్‌లో తన తండ్రి టీజీ వెంకటేష్ సొంత నిధులతో కట్టించిన నగర పాలక సంస్థ పాఠశాల వద్ద ఆగి టీజీవీ సంస్థలు చేసిన అభివృద్ధి పనులను చూపించారు. కేవలం తమకు మంచి పేరు వస్తుందనే ఉద్దేశ్యంతో ఇక్కడ తన తండ్రి పేరుతో ఉన్న బోర్డును ఈ పాలకులు చెరిపివేశారని మండి పడ్డారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేషగిరి శెట్టి, విఠల్, శ్రీధర్, చంద్రకాంత్, మంజు, నాగవీరాంజనేయులు, రాజ్యలక్ష్మి, సురేష్, శ్రీనివాసులు, రమేష్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

రంగనాథ స్వామి హుండీ లెక్కింపు



పత్తికొండ, మార్చి 26 : పులికొండ గ్రామంలో వెలసిన సంతానవరదుడు పులికొండ రంగనాథస్వామి దేవాలయం హుండీలెక్కింపు మంగళవారం నిర్వహించారు. ఆలయఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఛైర్మన్ శ్రీరంగడుల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థుల సమక్షంలో హుండీఆదాయాన్ని లెక్కించారు. ఈ ఏడాదికి సంబంధించి రూ 12లక్షల 51వేల 730 ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు. పర్యవేక్షణఅధికారి సుబ్బరాయుడు, గ్రామనాయకులు, ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

గరుడ వాహనంపై రంగనాథ స్వామి

మద్దికెర, మార్చి 26: పెరవలి గ్రామంలో ఎంతో ప్రసిద్ధి చెందిన రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రంగనాథుడు గజ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. మంగళవారం మూలవిరాట్ రంగనాథస్వామికి ఆలయ ప్రధాన అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అర్చకులు పంపిణీ చేశారు శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ఊరేగించారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు టీడీపీ సీనియర్ నాయకులు పి.పురుషోత్తం చౌదరి, రత్నకుమారి, పోతుల సాయి చౌదరి, గడిపినేని గోపాల్ చౌదరి, దేవాలయ ఛైర్మన్ ఈడిగ దస్తగిరిగౌడు, ఈవో చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

నేడు రథోత్సవం: పెరవలి గ్రామంలోని రంగనాథస్వామి రథోత్సవం బుధవారం సాయంత్రం నిర్వహిస్తున్నట్లు ఈవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ వేడుకలకు భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పేదలను ఆదుకోవాలి



4 పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న పారా కుటుంబీకులు

మద్దికెర, మార్చి 26: అనాథలుగా జీవనం సాగిస్తున్న వారిని, పేదరికంతో మగ్గుతున్న వారిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విరాళ దాతలు పారా రామచంద్రప్రసాద్, పారా విశ్వనాథ్ (చిట్టిన్న) అన్నారు. మంగళవారం పెరవలి గ్రామంలో 500 మంది పేదలకు పారా రామన్న సేవా సమితి ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది పెరవలి గ్రామంలోని బ్రహ్మోత్సవాల్లో భాగంగా పేదవారికి దుస్తులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పారా జయవర్దన్, సేవా సమితి సభ్యులు ఫక్కీరప్ప, నారాయణ పాల్గొన్నారు.

అన్నదాన స్థలంలో భూమి పూజ

మద్దికెర, మార్చి 26: పెరవలి గ్రామంలో రంగనాథ స్వామికి ఇచ్చిన అన్నదాన స్థలంలో ఆలయ ఛైర్మన్ ఈడిగ దస్తగిరిగౌడు, ఆలయ ప్రధాన అర్చకులు రంగస్వామి మంగళవారం భూమి పూజ చేశారు. దేవాలయం, దినాదినాభివృద్ధి చెందుతుందని, బ్రహ్మోత్సవల్లో భాగంగా భక్తులు తరలి వస్తారని అన్నారు. దేవాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఉన్నారు.

పోటాపోటీగా రాతి దూలం పోటీలు



రాతిదూలం పోటీలు ప్రారంభిస్తున్న అశోక్‌రెడ్డి

తుగ్గలి, మార్చి 26: పెద్దమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని నిర్వహించిన రాతిదూలం పోటీలు పోటాపోటీగా జరిగాయి. మంగళవారం లంకాయపల్లిలో నిర్వహించిన రాతిదూలం పోటీలను అశోక్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, సుల్తాన్ ప్రారంభించారు. ఈ పోటీలకు 12 జతల వృషభాలు పాల్గొన్నాయి. మొదటి విజేత బహుమతి దాత అమర్నాథ్ రెడ్డి రూ.30వేలు, రెండో బహుమతిని దాత సుల్తాన్ రూ.20వేలు, మూడో విజేతకు రూ.15వేలు దాతలు రమేష్, రామాంజనేయులు అందజేశారు. వృషభాల యజమానులకు శంకర్ రెడ్డి అన్నదానం చేశారు. వెంకాయపల్లె హనుమంతురెడ్డి, టీడీపీ నాయకులు లింగన్న, ఏకాంత్ , తులసీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ముస్లింలకు విందు ఏర్పాటు చేసిన పోలీసులు

వెల్దుర్తి, మార్చి, 26 : రంజాన్ మాసంలో ఉపవాసదీక్షలు చేపడుతున్న ముస్లిం సోదరులకు సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డిలు మంగళవార సాయంత్రం జామియా మసీదులో ప్రార్థనల అనంతరం ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ముస్లీం మతపెద్దలు, గురువులు, ముస్లీం సోదరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

వెల్దుర్తి, మార్చి, 26 : ఏపీటీఎఫ్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి మహేశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా నాగమద్దయ్య, గౌరవ అధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షుడిగా రాజేష్, అదనపు కార్యదర్శిగా మధుసూదన్, ఉపాధ్యక్షులుగా నాగమణి, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శులుగా సోమన్న, కృష్ణమూర్తి, వెంకటరమణారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కర్ణాటక మద్యం తరలింపుపై ఉక్కుపాదం మోపండి

● డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

కోసిగి, మార్చి 26: కర్ణాటక మద్యం తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ నేర విభాగం నాగమద్దయ్య అన్నారు. మంగళవారం కోసిగిలోని సెబ్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సెబ్ సీఐ మహబూబ్ బాషా కర్నూలు ఏఈఎస్ వినోద్ కుమార్, సెబ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నర్సానాయుడులతో కలిసి అక్రమ కర్ణాటక మద్యం పై చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య మాట్లాడుతూ నాన్ డ్యూటీ ఫైర్ మద్యం, నాటుసారాను, బెల్టు షాపులపై విస్తృత దాడులు చేసి కేసులు నమోదు చేయాలని, పాత నేరస్థులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. అక్రమ మద్యం తరలించే మార్గాల్లో రోజు రూట్ వాచ్‌లు నిర్వహించాలని ఆదేశించారు.

బహిరంగంగ కార్యక్రమాలకు అనుమతులు తప్పనిసరి

● ఆర్డీవో రామలక్ష్మి

● రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో రామలక్ష్మి

పత్తికొండ, మార్చి 26 : రాజకీయ పార్టీలు బహిరంగంగా నిర్వహించే కార్యక్రమాలకు అనుమతులు తప్పకతీసుకోవాలని పత్తికొండ ఆర్డీవో. ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆమె రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళి అనుసరించి అన్ని రాజకీయపార్టీలు సహకరించాలన్నారు. ప్రతిపార్టీ నుంచి ఇద్దరు నాయకులు ఆర్వో కార్యాలయంతో సమాచారం కోసం అందుబాటులో ఉండాలన్నారు. బహిరంగ ప్రాంతాలలో నిర్వహించే రాజకీయ కార్యక్రమాలుకాని ఇతరత్రా కార్యక్రమాలుకాని నిర్వహించుకోవాలంటే 48గంటల ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరని వివరించారు. ఒకేరోజు రెండు రాజకీయ పార్టీలు కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అనుమతులు కోరితే ఆన్‌లైన్‌లో ముందు ఎవరు నమోదు చేసుకున్నారో వారికి అనుమతి ఇస్తామని పేర్కొన్నారు.

బొందిమడుగుల వీఆర్‌వోను సస్పెండ్ చేశాం..

తుగ్గలి మండల పరిధిలోని బొందిమడుగుల గ్రామంలో ఓటర్‌కార్డులు వీధిలో పారేసిన సంఘటనపై గ్రామ వీఆర్‌వోను సస్పెండ్ చేసినట్లు ఆర్వో రామలక్ష్మి తెలిపారు. 2014కు సంబంధించి ఓటరుఐడీకార్డులు పంపిణీ చేయకుండా బయట పారవేసిన విషయంపై ఆయనకు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీచేశామని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలు, ఇబ్బందుల గురించి ప్రజలు ఫిర్యాదుచేసేందుకు ఎన్నికల సంఘం అందుబాటులో ఉంచిన సీవిజిల్ యాప్‌ద్వారా పత్తికొండ నియోజకవర్గంలో 13 ఫిర్యాదులు అందాయన్నారు. ప్రజలు ఈ యాప్‌ద్వారా ఫిర్యాదులు అందించడంతోపాటు తమకు కలిగిన ఇబ్బందులపై న్యాయం పొందవచ్చని సూచించారు.

టీడీపీలో చేరిన చెరుకులపాడు వాసులు

● పార్టీలోకి ఆహ్వానించిన కేఈ శ్యాంబాబు

● చెర్లకొత్తూరు, ఎల్.కొట్టల, పేరాముల, రామళ్లకోట గ్రామాల్లో టీడీపీ శంఖారావం



శ్యాంబాబు సమక్షంలో టీడీపీలో చేరిన చెరుకులపాడు గ్రామస్థులు

వెల్దుర్తి, మార్చి 26 : టీడీపీ మండల అధ్యక్షుడు బలరాంగౌడ్, సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో కేఈ.శ్యాంబాబు సమక్షంలో ఎమ్మెల్యే శ్రీదేవి స్వగ్రామమైన చెరుకులపాడు గ్రామస్థులు టీడీపీలో చేరారు. మంగళవారం వెల్దుర్తిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేఈ శ్యాంబాబు మాట్లాడారు. ఒక్క చాన్స్ అంటూ సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని పాతాళంలోకి నెట్టారని విమర్శించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం డ్రగ్స్, గంజాయిలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చారన్నారు. రూ.50వేల కోట్ల విలువచేసే డ్రై ఈస్ట్ పేరుతో 25 వేల కిలోల డ్రగ్స్ కాకినాడ పోర్టులో పట్టుబడిందని పేర్కొన్నారు.

ప్రజల భవిష్యత్తుకు టీడీపీ గ్యారంటీ

రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు గ్యారంటీ అని కర్నూలు పార్లమెంటు అభ్యర్థి పంచలింగాల నాగరాజు అన్నారు. మంగళవారం చెర్లకొత్తూరు, ఎల్.కొట్టాల, పేరాముల, రామళ్లకోట గ్రామాల్లో కేఈ శ్యాంబాబుతో కలిసి శంఖారావం కార్యక్రమం చేపట్టారు. టీడీపీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీ అభ్యర్థి నాగరాజు మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేరని, మళ్లీ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే చంద్రబాబు నాయుడితోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చెర్లకొత్తూరు పుల్లయ్య, కొట్టల మురళీ, పేరాముల మధుసుదన్ రెడ్డి, రామళ్లకోట రామకృష్ణాచారి, సూదేపల్లె జయరాముడు, కలగొట్ల రామకృష్ణ, బోగోలు అమర్‌నాథ్‌గౌడ్, గోవర్ధనగిరి రామచంద్రుడు, గుంటుపల్లె వెంకటరాముడు, రామస్వామి పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి కృషి చేయాలి : రాఘవేంద్రరెడ్డి



కోల్‌మాను పేటలో మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

కోసిగి, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల్లో మంత్రాలయం నియోజకవర్గంలో టీడీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి మాధవరం రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం కోల్‌మాన్‌పేట గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్ ఆధ్వర్యంలో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రాలయం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డీఏ హవా నడుస్తోందని, దేశంలో నరేంద్ర మోదీ మరోసారి ప్రధానిగానూ, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా గెలవడం ఖాయమని స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, సురేష్ నాయుడు, గుడిసె శ్రీరాములు, సతీష్ నాయుడు, తోవి రామక్రిష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి: తిక్కారెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి

మంత్రాలయం, మార్చి 26: టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి వైసీపీ మోసాలను ప్రజలకు వివరించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మంత్రాలయం కన్వీనర్ పన్నగ వెంకటేశ్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కోసిగి మండలంలోని జంపాపురం, చిన్నబోంపల్లి, పెద్దకడుబూరు మండలంలోని చిన్నతుంబళం, బసలదొడ్డి, పులికనుమ నాయకులు, కార్యకర్తలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అందరూ సమిష్టిగా పని చేసి మంత్రాలయంలో టీడీపీని గెలిపించుకుని చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకొనేందుకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు విజయరామిరెడ్డి, యేబు, సోల్మాన్‌రాజు, చిదానంద, క్రిష్ణ; నీలకంఠ, వక్రాణి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం జోహరాపురం గ్రామస్థుల ధర్నా



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

ఆస్పరి, మార్చి 26 : తాగునీటి కోసం జోహరాపురం గ్రామస్థులు ఆందోళనకు దిగారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొందని, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను పక్కదారి పట్టించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరుణాకర్, సతీష్ మాట్లాడుతూ ఏడాది కాలంగా వర్షాభావ పరిస్థితుల వల్ల గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొన్నా పట్టించుకునే నాథుడే లేరన్నారు. గ్రామంలో నీటి వనరులు లేక అల్లాడిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తాగునీటి కోసం రూ.10 లక్షలు మంజూరు చేయగా, కేవలం రూ.5 లక్షలతో పైపులైను వేసి వదిలేశారని విమర్శించారు. అనంతరం ఎంపీడీవో లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. మాణిక్యప్ప, సతీష్, హనుమంతు, వెంకటరాముడు పాల్గొన్నారు.

క్రేజీవాల్ అరెస్టు దుర్మార్గం

ఆలూరు, మార్చి 26 : ఇండియా కూటమి నేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు అన్యాయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిప్పగిరి లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అరెస్టు పూర్తిగా దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ముందు అన్ని ప్రతిపక్ష పార్టీల గొంతును నొక్కి అణిచివేయడానికి మోదీ పన్నిన పన్నాగమన్నారు. రానున్న ఎన్నికల్లో మోదీ ప్రభుత్వం చిత్తుగా ఓడిపోతుందనే భయంతోనే సీఎంను అరెస్టు చేసే వరకు వెళ్లారని విమర్శించారు.

పోలీసులకు డీజీపీ కమాండేషన్ పతకాలు

కర్నూలు, మార్చి 26: ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లా పోలీసులకు డీజీపీ కమాండేషన్ డిస్క్ పతకాలు లభించాయి. 2022 సంవత్సరానికి సిల్వర్, కాంస్యం విభాగాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఈ పతకాలను ప్రకటించింది.

● **సిల్వర్ విభాగంలో:** జి.కృష్ణకాంత్, (జిల్లా ఎస్పీ కర్నూలు), చెన్నయ్య (హెచ్‌సీ, సీ.బెళగల్), సుభాన్ (హెచ్‌సీ, ఆదోని వన్‌టౌన్), చంద్రశేఖర్ (హె చ్‌సీ, శిరివెళ్ల), షేక్ ఇబ్రహీం (హెచ్‌సీ, కోవెలకుంట్ల), సీ వెంకటరమణ (పీసీ, సెకండ్ బెటాలియన్), లక్ష్మణ్ సింగ్ (పీసీ సెకండ్ బెటాలియన్).

● **కాంస్య విభాగంలో:** కే మల్లికార్జున (ఎస్ఐ, కర్నూలు), నాగరాజు (హెచ్‌సీ, ఎమ్మిగనూరు), ఎస్.నాగరాజు (పీసీ, సీసీఎస్), కాశీం (పీసీ ఆదోని తాలుకా), రామక్రిష్ణ (పీసీ, కోడుమూరు), రమేష్ (పీసీ, సీ.బెళగల్), చంద్ర బాబు నాయుడు (పీసీ, ఎమ్మిగనూరు), నరేంద్ర (పీసీ, ఆదోని త్రీటౌన్), భాస్కర్ (పీసీ, కర్నూలు), తిప్పేస్వామి (డీఎస్పీ, నంద్యాల), వి.నాగరాజు (హె చ్‌సీ, నందికొట్కూరు), జి.రమేష్ (పీసీ, ఎస్‌బీ, నంద్యాల), మధుసుధాకర్ (పీసీ, నంద్యాల త్రీటౌన్), గురుబాబు (పీసీ, బేతంచెర్ల), క్రిష్ణమూర్తి (పీసీ, నంద్యాల), పెద్దస్వామి, (పీసీ, నంద్యాల), శ్రీనివాసులు (హెచ్‌సీ, నంద్యాల)., శివశంకర్ రెడ్డి (ఆర్ఎస్ఐ, సెకండ్ బెటాలియన్), అయ్యన్న (ఏఆర్ఎస్ఐ, సెకండ్ బెటాలి యన్), క్రిష్ణయ్య (ఏఆర్ఎస్ఐ, సెకండ్ బెటాలియన్), గోపాల్ (ఏఆర్ఎస్ఐ, సెకండ్ బెటాలియన్), సుందర్‌రాజు (ఏఆర్ఎస్ఐ, సెకండ్ బెటాలియన్), ప్రహ్లాదరావు (హెచ్‌సీ, సెకండ్ బెటాలియన్).

సంక్షిప్త సమాచారం

కబ్జాకోరులపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్, మార్చి 26: పట్టణ శివారు కర్నూలు రోడ్డులో ఉన్న హిందూ బీసీ స్మశానవాటిక స్థలాన్ని కబ్జాచేయాలని చూస్తున్న కబ్జాకోరులపై చర్యలు తీసుకోవాలని బీసీ సంఘాల నాయకులు బతకన్న, వీజీఆర్ కొండయ్య, లచ్చన్న, యాపిలయ్య, బీఎల్ నారాయణ, వీరన్న అన్నారు. సోమవారం బీసీ స్మశానవాటిక స్థలంలో బండలు పాతేందుకు ప్రయత్నిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న బీసీ సంఘాల నాయకులు అక్కడికి వెళ్లి బండలు ఏర్పాటు చేయకుండా అడ్డుకున్నారు. తహసీల్దార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ శేషారెడ్డి స్పందిస్తూ ఆ స్థలంలోకి ఎవరిని వెళ్లకుండా 145 సెక్షన్ విధిస్తామని, బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

31న శ్రీమఠం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

మంత్రాలయం, మార్చి 26: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో ఐడీఏఆర్‌సీ ఇంటర్నేషనల్ సంస్థచే ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్, డయాబెటిస్, కార్డియాలజీ, డెర్మాటాలజీ, న్యూరాలజీ, మొదలైన వైద్యనిపుణులు అధ్యాతునిక యంత్ర పరికారాలతో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు.

న్యాయవాదులకు ఏపీయుడబ్ల్యూజే సన్మానం

పత్తికొండ టౌన్, మార్చి 26: పట్టణంలో మంగళవారం ఏపీయుడబ్ల్యూజే ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన న్యాయవాదులకు విలేకరులు ఘనంగా సన్మానించారు. స్థానిక రీడింగ్ రూమ్ ఆవరణలో యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు సాలు రంగడు, గౌరవాధ్యక్షులు రంగన్న, ప్రధాన కార్యదర్శి ఓబులేసు తదితరులు నూతనంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన రంగస్వామి, ఉపాధ్యక్షులుగా రవికుమార్, ట్రెజరర్ రాజశేఖర్ నాయుడులను శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మంజునాథ్, నాగరాజు, గిడ్డయ్య, మధుబాబు, షఫీ, షేక్షావలి, రాజు, జాఫర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాల కవాతు

నందవరం, మార్చి 26: నందవరం, ముగతి గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు మంగళవారం ఎస్ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. నోటిఫికేషన్ విడుదల అయిన క్షణం నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని ఎస్ఐ తెలిపారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చేనేతల ఆత్మహత్యలు పట్టవా? : మాజీ ఎమ్మెల్యే బీవీ



ఎమ్మిగనూరులో ప్రచారం నిర్వహిస్తున్న జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, మార్చి 26: ఎన్నికల్లో సీట్లు.. ఓట్లు కావాలంటే చేనేతలు కావాలి.. వారు ఆత్మహత్యలు చేసుకుంటుంటే మాత్రం కనీస స్పందన లేదని ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని నాలుగో వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతలకు నేతన్న నేస్తం ఇచ్చామని చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం వేల సంఖ్యలో చేనేత కుటుంబాలు ఉంటే కేవలం 1300మందికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని ఆరోపించారు. కూలీ మగ్గాలు నేస్తున్న వారికి నేతన్న నేస్తం ఇవ్వకుండా ఎగనామం పెట్టారన్నారు. కడప జిల్లా ఒంటి మిట్ట మండలం మాదవరంలో చేనేత కుటుంబం ఆత్మహత్య చేసుకుందని, ఈ మరణాలకు కారణం ఎవరో.. చేనేతలమని చెప్పుకుని ఓట్లు అడుగుతున్న వారు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ కౌన్సిలర్ రామదాసు గౌడ్, టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దయాసాగర్, నాయకులు మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొండయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

ఆదోని టౌన్, మార్చి 26 : టీబీ నిర్మూలనలో ఉత్తమ సేవలను అందించి కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు పొందిన టీబీ యూనిట్ సిబ్బందికి మంగళవారం స్థానిక టీబీ యూనిట్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. డీపీఎంవో సీతారాములు మాట్లాడుతూ టీబీ నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు అందించడంలో తమ సిబ్బంది చేసిన కృషి అభినందనీయమన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ సాగర్, హెల్త్ విజిటర్ మనోరంజని దేవి, ల్యాబ్ టెక్నీషియన్ ప్రవీణ్ కుమార్‌లకు శాలువాలతో సన్మానించారు. ఎంపీహెచ్ఎస్ బాబురాజు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టం నిర్వీర్యం

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 26 : విద్యాహక్కు చట్టాన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు నీరుగారుస్తున్నాయని పీడీఎస్యూ జిల్లా అధ్యక్షుడు అఖండ అన్నారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాల వద్ద ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 విద్యాసంవత్సరం ఆరంభం కాకమునపే కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్మిషన్లు చేయించుకోవడం దారుణం అన్నారు. ఇది విద్యాహక్కు చట్టానికి విరుద్ధమని అన్నారు. తల్లిదండ్రులకు మాయామాటలు చెప్పి, వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీని పై స్పందనలో సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా, విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదని పేర్కొన్నారు. నాయకులు మల్లికార్జున, నరేష్, రసూల్, వీరేష్, సునీల్, రవి పాల్గొన్నారు.

అర్చకులపై దాడి చేసి వారిని అరెస్టు చేయండి

● ఏపీ బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎంకే నాగరాజరావు

మంత్రాలయం, మార్చి 26: అర్చకులపై దాడిచేసిన వైసీపీ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమైఖ్య రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎంకే నాగరాజరావు డిమాండ్ చేశారు. మంగళవారం అర్చకులపై దాడులు అరికట్టాలని ఆయన మంత్రాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకినాడా శివాలయంలో పని చేసే అర్చకులు సాయిశర్మ, విజయ్‌కుమార్ శర్మలపై ఈ నెల 25న గర్భగుడిలో పూజలు చేస్తున్న అర్చకులను వైసీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్ సిర్యాల చంద్రశేఖర్ దాడి చేసి కాలితో తంతూ తీవ్రంగా గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. బ్రాహ్మణ సంగం నాయకులు షైనపాటి చంద్రశేఖర్, అన్నదానం వెంకట్రమణ, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: కాకినాడ శివాలయ అర్చకులు సాయిశర్మ, విజయ్ కుమార్‌లపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణకార్పొరేషన్ జిల్లా మాజీ కో-ఆర్డినేటర్ గురు రాఘవేంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భౌతిక దాడికి దిగిన వైసీపీ మాజీ కార్పొరేటర్ చంద్రశేఖర్‌పై కేసునమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు.

ఉద్యోగుల ప్రయోజనాలకు తూట్లు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 26 : ఎన్నో పోరాటాలతో సాధించుకున్న ఉద్యోగుల ప్రయోజనాలను నేటి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీ నాగరాజు ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏపీజీఎల్ఐ, జీఐఎస్ పీఆర్సీ బకాయిలను చెల్లించకుండా తాత్సారం చేస్తుందని ఆరోపంచారు. ప్రభుత్వం తమకు బకాయిలను చెల్లించకపోగా, రూ.20వేల కోట్లు వాడుకుందన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. జాతీయ విద్యావిధానంలో భాగంగా మూతపడిన పాఠశాలలను పునరాలోచించి పునఃప్రారంభించాలని కోరారు.

ముమ్మరంగా పూడిక తొలగింపు

ఆదోని టౌన్, మార్చి 26 : పట్టణంలోని పెద్దవంకలో పేరుకుపోయిన పూడికను తొలగించే పనులను మంగళవారం చేపట్టారు. చాలాకాలంగా పూడిక తొలగించని కారణంగా పెద్దవంకలో మురుగునీరు సక్రమంగా పారే పరిస్థితి లేకపోవడంతో కమిషనర్ రామచంద్ర రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు.. వర్షాలు కురిసేలోగా పట్టణం గుండా ప్రవహించే పెద్దవంకలో పూడిక తొలగింపు చేపట్టడం కోసం ఇప్పటినుండే పనులను ప్రారంభించడం జరిగిందని కమిషనర్ తెలిపారు. అనంతరం పట్టణ ప్రజలకు తాగునీరు అందించే బసాపురం చెరువును సందర్శించి నీటి నిలువను పరిశీలించారు.

జాతీయ స్థాయి పోటీలకు హత్తిబెళగల్ విద్యార్థులు

ఆలూరు, మార్చి 26 : రాష్ట్రస్థాయి సెపక్ తక్ర పోటీలు గతనెల నెల్లూరులో జరిగాయి. ఈ పోటీలో జిల్లా నుంచి ఆలూరు మండల జడ్పీహెచ్ఎస్ హత్తిబెళగల్ విద్యార్థులు మానస, నూర్జహాన్ జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలోని దావణగెరిలో 27 నుంచి జరిగే జాతీయ స్థాయి సెపక్ తాక్రా పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు చిన్నబాబును ఆయన అభినందించారు.

దళితుడిపై ఎస్ఐ దాడి అమానుషం

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 26 : ఆలూరు మండలం, పెద్దహోతూరు గ్రామ దళిత యువకుడు రాజశేఖర్‌పై తప్పుడు కేసు పెట్టడమే కాకుండా ఎస్ఐ ఓబులేష్ దాడి చేయడం అమానుషమని మానవహక్కుల వేదిక నాయకులు అన్నారు. ఈ మేరకు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యూజీ శ్రీనివాసులు, ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు సుజ్ఞానమ్మ, ప్రజాసంఘ నాయకులు గంగన్న, ప్రసాద్, జిలాన్ ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజశేఖర్‌ను మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉచ్చీరప్ప తిరునాలలో మంచినీళ్ల ప్యాకెట్ల కొనడానికి వెళ్లిన దళిత యువకుడు రాజశేఖర్‌ను లింగాయత్ కులానికి చెందిన విశ్వనాథ్ గౌడు కులం పేరుతో దూషించడమే కాకుండా, అపద్దపు ఫిర్యాదు చేశారని అన్నారు. న్యాయం చేయాల్సిన ఆలూరు తాలూకా ఎస్సై ఓబులేసు బాధితుడి పై కేసు పెట్టి, కుడి కాలి బోటనవేలు విరిగేలా కొట్టి చిత్రహింసలకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా ఇంతవరకు పోలీసులు బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకోలేదని అన్నారు. విశ్వనాథ్ గౌడ్ పైన, ఎస్సై ఓబులేష్ పైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుల దాడి

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 26 : ఆదోని డిపోకు చెందిన బస్సు డ్రైవర్ వెంకటేష్‌పై మంగళవారం మధ్యాహ్నం కర్నూలు సమీపంలోని వెంగాయపల్లె ఎల్లమ్మ గుడి దగ్గర మద్యం మత్తులో యువకులు దాడి చేసి గాయపరిచారు. ఒంగోలు నుంచి ఆదోనికి వస్తున్న బస్సులో ఎస్ఎం బాషా డ్రైవింగ్ చేస్తుండగా.. మరో డ్రైవర్ వెంకటేష్ టికెట్ ఇస్తున్నారు. మంగళవారం కావడంతో ఎల్లమ్మ గుడి దగ్గర జనంతో రోడ్డు జామ్ అయింది. రోడ్డుకు అడ్డంగా ఉన్న ముగ్గురు యువకులను పక్కకు జరగాలని డ్రైవర్ వెంకటేష్ వారికి చెప్పడంతో వారు డ్రైవర్‌పై విచక్షణరహితంగా దాడి చేసి గాయపరిచారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నట్లు డిపో కమిటీ నాయకులు హరిబాబు తెలిపారు.